



# కరపత్రం

SINCE 2014

గురువారం మార్చి 19, 2026 | సంపుటి : 2 | సంచిక : 158 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## గవర్నర్ ప్రసంగం దార్శనికతకు అద్దం

# తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించాం

- చేసిందీ..చేయబోయేది స్పష్టం చేశాం
- సూచనలు ఇచ్చే ప్రయత్నం చేయని విపక్షం
- గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా రాని కెసిఆర్
- ఇంకా అహంకార ధోరణి వీడని కొందరు నేతలు
- కెసిఆర్ సభకు వచ్చి సూచనలు సలహాలు ఇవ్వాలి
- జీతాలు తీసుకుంటూ సభకు రాకుంటే ఎలా
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సిఎం సమాధానం



**హైదరాబాద్,మార్చి18 :**

గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలా ముందుకు పోవాలో..పోతున్నదో ఇందులో వివరించామని అన్నారు. తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించిందన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. 'రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి అని ప్రతిపక్షంపై సీఎం మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు.కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చిన కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకైన ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ సభ రాడా.. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. 4 కోట్ల ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందని తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక. ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించాం. అభివృద్ధిలో కలిసి వస్తారని ఆశించాం.. కానీ అహంకారం ప్రదర్శించారు. 4 కోట్ల మంది ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను పక్క దారి పట్టించారు. ప్రతిపక్షంలో కూర్చొబెట్టిన వాళ్ల తీరు మారలేదు. సభ

## మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో

# వాదోపవాదాలు

- మూసీని అడ్డుకుంటున్న విపక్ష బిఆర్ఎస్
- రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డ భట్టి
- డిపిఆర్ సిద్దం చేశామన్న మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,మార్చి18 :**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ మరియు ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మూడోరోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతంలోని పేదల జీవితాలను మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, ప్రతిపక్షం మాత్రం రాజకీయ లబ్ది కోసం అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు. మూసీ నిర్వాసితుల పునరావాసంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బాధితులకు అదే ప్రాంతంలో అత్యాధునిక అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. నిరుపేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, కానీ నిర్వాసితులు మురికి కూపంలోనే మగ్గిపోవాలని బీఆర్ఎస్ కోరుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్రం చేయడం మాత్రమే కాకుండా, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మొదటి దశ డీపీఆర్ తయారైందని చెప్పారు. అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7000 కోట్లుగా చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. తుది ఎన్యుమరేషన్ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని.. 2013 చట్టం ప్రకారం అవసరమైన భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని మంత్రి వివరించారు.అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం సంతృప్తిగా లేదన్నారు. 'డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని జనవరిలో చెప్పారు. పాకిస్థాన్‌లో నిషేధించిన కంపెనీకి అవకాశం ఇచ్చారు. డీపీఆర్‌ను సభ ముందు పెట్టాలి. రుణానికి ఏడీబీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు గతంలో సభలో మంత్రి తెలిపారు. కానీ.. డీపీఆర్ ఇవ్వలేదని.. రుణం మంజూరు చేయలేదని ఏడీబీ స్పష్టం చేసింది. సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారా రూ.16వేల కోట్లతో అయ్యే ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రూ.లక్షన్నర కోట్లు అని చెప్పారు. మొదటి దశ రూ.7వేల కోట్లు అంటున్నారు.. ఇంకా ఎన్ని దశలు ఉంటాయి? ఎన్ని నివాసాలు కూలుస్తారు? మంత్రి 1,435 నిర్మాణాలు అన్నారు.. గెజిట్‌లో 10వేల నిర్మాణాలు అని పేర్కొన్నారు. వీటిలో ఏది కరెక్ట్?. మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు.. అందులో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకం.'అని కేటీఆర్ ప్రశ్నించారు.శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. 'ప్రభుత్వం దగ్గర నిధులు లేవు.. ప్రణాళికలు లేవు. ఏడీబీ రుణం ఇవ్వలేదు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.



2లో..

## రూ.2400 మద్దతు ధర..

# రూ.500 బోనస్

- మక్కలు మార్కెట్లోకి వచ్చిన కొనుగోళ్లు ఏవీ
- ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్రనష్టం
- గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- వెంటనే మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్

**హైదరాబాద్,మార్చి18 :**

రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు.



2లో..

# రాష్ట్రం సిగలో మరో మణిహారం

- » 2న నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- » రైతు ఉత్సవాలకు ముస్తాబు అవుతున్న నర్మెట్ట
- » నేడుప్రదర్శన శాలలను ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- » వ్యవసాయం, పశుసంవర్ధక అనుబంధ రంగాల స్టాల్స్
- » 22 వరకు కొనసాగునున్న రైతు ఉత్సవం

**హైదరాబాద్,మార్చి18 :**

రాష్ట్ర సిగలో మరో మణిహారంగా నిలిచే నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22న ఘనంగా ప్రారంభంకానుంది. ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇలా ప్రజా ప్రతినిధులందరికీ ఆహ్వానాలు అందజేసినట్టు తెలిపారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే రైతు ఉత్సవాల కోసం నర్మెట్ట కర్మాగార ప్రాంతం ముస్తాబు అవుతోంది.




# తెలుగువారందరికీ గవర్నర్ శివప రతాప్ శుక్లా ఉగాది శుభాకాంక్షలు



**హైదరాబాద్:**

ప్రపంచంలోని తెలుగువారందరికీ తెలంగాణ గవర్నర్ శివప రతాప్ శుక్లా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 'పరాభవ నామ ఉగాది శుభ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు మాట్లాడే సోదరులు, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ తెలుగు నూతన సంవత్సరం మీకు, మీ కుటుంబ సభ్యులకు ఆశీర్వాదాలు, సమృద్ధి ప్రసాదించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.'ఉగాది ఆనందం, ఆశల పండుగ. ఈ నూతన సంవత్సరం కొత్త ఉత్సాహం, ప్రకాశవంతమైన భవిష్యత్తును తీసుకురావాలి. ఉగాది స్ఫూర్తిని, సంప్రదాయ ఉగాది పచ్చడిలోని విభిన్న రుచులు సూచించే భావాన్ని ఆమోదించి, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆశావాద దృక్పథంతో ఎదుర్కొందాం. ఈ శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రతి ఒక్కరికీ, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు శాంతి, సమృద్ధి, ఐక్యత, ఆరోగ్యం, ఆనందం తీసుకురావాలి' అని గవర్నర్ శివప రతాప్ శుక్లా తన సందేశంలో పేర్కొన్నారు.



# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

- ఎందుకు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయలేదు
- కడప ఎంపి సీటు కోసమే వివేకా హత్యజరిగింది
- పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు

విశాఖపట్నం,మార్చి18

2 లో



# గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉంది - ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు చెప్పించిందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుంది తప్పితే..


## ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా..

# తెలంగాణ సర్కార్ కీలక ప్రకటన

**హైదరాబాద్:**

ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాపై తెలంగాణ సర్కార్ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎల్‌పీజీ సిలిండర్లకు కొరత లేదని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో నిన్న(మార్చి 17, మంగళవారం) 2 లక్షల 35 వేల 678 LPG సిలిండర్లను డెలివరీ చేసినట్లు తెలిపింది.





# రూ.2400 మద్దతు ధర..
# రూ.500 బోనస్

మొదటిపేజీ తరువాయి

మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే.. ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే.. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని అన్నారు. పంట అంతా దళారుల పాలైన తర్వాత, ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే, మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పేర్కొన్నారు. బ్జడెట్‌లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగానికి ఇన్ పుట్ సబ్సిడీ అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం కేవలం మాటల్లో చెబుతున్నదే తప్ప, ఇప్పటివరకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ నిధులను విడుదల చేయడం లేదని అన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల జరిగిన నష్టంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వెంటనే నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. తక్షణమే ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలన్నారు. మద్దతు ధర లేకపోవడంతో పాటు వర్షాల కారణంగా అన్నదాతలు నష్టపోతున్నారని తెలిపారు. 25 శాతం పంట.. దళారుల చేతికి వెళ్లిందని అన్నారు. పంటల బీమా అమలు చేయడం లేదని విమర్శించారు. వడగండ్ల వానతో రైతులు నష్టపోయారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని... వెంటనే ఇవ్వాలన్నారు. రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.మొక్కజొన్న రైతులను కాంగ్రెస్ సర్కార్ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద ఎమ్మెల్యేల నుంచి మక్కలు, కందులు లాక్కున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీశ్‌రావు చేతికి గాయమైంది. గాయం కావడంతో హరీశ్‌రావు చేతి నుంచి రక్తం కూడా వచ్చింది. మరోవైపు అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద పాడి కౌశిక్ రెడ్డి చేతిలో నుంచి చీఫ్ మార్షల్ కరుణాకర్ మక్కలు లాక్కొని కిందపడబోశారు. మార్షల్స్ తీరుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద కూర్చొని నిరసన తెలిపారు. మార్షల్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఎందుకు ఈ కేసును తేల్చలేక పోయారని అన్నారు. దీనికి ఎందుకు న్యాయం చేయలేదని నిలదీసారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి.. వివేకా కుమార్తె సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతనే చెప్పారని.. అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్‌రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతిలో పెట్టుకుని వ్యక్తిత్వ హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికంగా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తుచేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతుందనే కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేక పోయారని ప్రశ్నల వర్షం కురిపించారు. సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్‌రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తున్నారని అన్నారు. 'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికే ఆయనో కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితులపట్ల నిలబడ్డారనే విషయం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తెలిస్తే ఎంతగానో బాధపడేవారు. వివేకా హత్య కేసులో న్యాయం కోసమే చంద్రబాబును కలిశారని.. నిరంతరం పోరాటం సాగిస్తున్నారని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

**– డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా**
**– మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం**
**– పేదల ఇళ్లు కూల్చివేత దారుణం**
**– బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత**
**– అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్**
**– ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్**

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్‌ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్‌ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్య ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్‌ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# రాష్ట్రం సిగలో మరో మణిహారం

మొదటిపేజీ తరువాయి

ఉగాది పర్వదినాన సాయంత్రం 4 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ప్రదర్శనశాలలను ప్రారంభించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ రైతు మహోత్సవంలో వ్యవసాయం, పశుసంవర్ధక , అనుబంధ రంగాలకు సంబంధించిన మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖల విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఎఫ్.పి.ఓలు, స్టార్టప్ కంపెనీలు మరియు ప్రైవేట్ సంస్థలు తమ ఆధునిక సాంకేతికతలు, సేవలు, అవకాశాలను రైతులకు పరిచయం చేయనున్నాయి. బ్యాంకులు, ఎఫ్.పి.ఓలు, స్టార్టప్‌లు, ప్రైవేట్ కంపెనీల నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా ముఖాముఖి చర్చించే ప్రత్యేక వేదికను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. రైతు ఉత్సవం ఈ నెల 22 వరకు కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ శాస్త్రవేత్తలు, అనుబంధ శాఖల అధికారులు, అవార్డు గ్రహీతలు,అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. నెల 22న సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి రైతన్నలకు అంకితం చేయనున్నారు. అదే రోజున ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ దగ్గర 80 కోట్లతో నిర్మించే ర్గి÷నైరీ యూనిట్ కి శంకుస్థాపన కూడా చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి గారు రైతులతో వ్యవసాయరంగంలోని కీలక అంశాలపై ప్రత్యక్షంగా ముఖాముఖి మాట్లాడనున్నారు. అలాగే ఈ వేదిక నుండే ముఖ్యమంత్రిగారు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారు. నర్మెట్టలో ప్రారంభమవుతున్న ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రైతులకు మైలురాయిగా నిలవనుంది. దీని ద్వారా ఆయిల్ పామ్ రైతుల సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గి, రైతుల ఆదాయం పెరుగుటకు దోహదపడనుంది. రైతులు మరియు ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు, కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు లేకపోయిన గత ఖరీఫ్ లో మొక్కజొన్న కొనుగోళ్లు చేసినట్లు, ఈ యాసంగి కూడా ప్రభుత్వం కొనుగోళ్లు చేయడానికి సిద్ధంగా ఉందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు.

## ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా..
# తెలంగాణ సర్కార్ కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి

ఎల్‌పీజీ సిలిండర్లు రీ ఫిల్లింగ్ కోసం ఆందోళన చెందవద్దని వినియోగదార్లకు ప్రభుత్వం సూచించింది. సిలిండర్ల డెలివరీలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా మానిటరింగ్ చేయడానికి పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసింది. సగటున రోజుకు 2,15,151 ఎల్‌పీజీ సిలిండర్లు పంపిణీ జరిగేవని.. నిన్న అంతకు మించి డెలివరీ అయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నిన్న IOCL నుండి 93,887(+1%) సిలిండర్లు, ఌజూ నుండి 84,156 (+11,98%)సిలిండర్లు, ధీజూ నుండి 57,635 (+22.63%)సిలిండర్లు మొత్తం 2,35,678 సిలిండర్లు పంపిణీ జరిగినట్లు పౌర సరఫరాల శాఖ తెలిపింది.

# హర్మ్యూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య
# 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం

**– అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్**

హోర్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హోర్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పును నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది. అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హోర్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

# గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉంది

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధికి సంబంధించిన దిశా దశ లేదని ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు."అప్పుల కుప్పలా రాష్ట్రం ఉంటే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని భ్రమలు కల్పిస్తున్నారు. ఇది ఎట్లా సాధ్యమో చెప్పాలి. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు 5 శాతం పడిపోయాయి. ఆర్థిక క్రమశిక్షణ లేని.. అప్పుల జాతర రాష్ట్రంలో నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పాలన రైతుల పట్ల యమపాశంగా మారింది. ఉత్తర తెలంగాణలో జరిగిన పంట నష్టానికి పరిహారం ఇంత వరకూ ఇవ్వలేదు. రైతు భరోసా కోసం రైతులు ఎదురు చూస్తున్నారు" అని అన్నారు.

# తెలంగాణ సిఎస్ పదవీకాలం పొడిగింపు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన సర్వీసును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణారావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి రామకృష్ణారావు గతేడాది ఆగస్టు 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే.. రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన ప్రభుత్వం, గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం మార్చి 19, 2026

## ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన 63 డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజాలి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 18**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజాలి ఓరుగల్లు ప్రజలకు, కాజీపేట ప్రజలకు, 63 వ వార్డు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలికే పవిత్ర పర్వదినమని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కొత్త ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో జీవిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని అన్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని కార్పొరేటర్ విజయశ్రీ-రజాలి మనసారా ఆకాంక్షించారు.

## ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన 16వ డివిజన్ బిజెపి అధ్యక్షులు జాలిగాపు ప్రసన్న-రాంప్రసాద్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 18**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 16వ డివిజన్ బిజెపి అధ్యక్షులు జాలిగాపు ప్రసన్న-రాంప్రసాద్ ఓరుగల్లు ప్రజలకు, 16వ డివిజన్ వార్డు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలికే పవిత్ర పర్వదినమని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కొత్త ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో జీవిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని అన్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని ప్రసన్న-రాంప్రసాద్ మనసారా ఆకాంక్షించారు.

## ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రమ-రవీందర్ యాదవ్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 18**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రమ-రవీందర్ యాదవ్ ఓరుగల్లు ప్రజలకు, 62వ డివిజన్ వార్డు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలికే పవిత్ర పర్వదినమని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కొత్త ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో జీవిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని అన్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని కార్పొరేటర్ రవీందర్ యాదవ్ మనసారా ఆకాంక్షించారు.

## త్వరలో డిజిటల్ మీడియా పాలసీ

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 18**
వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రాబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. జర్నలిస్టుల సమస్యలపై శాసన మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.




జర్నలిస్టు మిత్రులకు భద్రత కల్పించే విషయములో ఈ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. అక్రిడేషన్ కార్డుల జారీ విషయములో కొంత మంది లేనిపోని అపోహలను సృష్టిస్తున్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు జారీచేస్తాం. ఎలాంటి బేషజాలాలకు పోకుండా మొదట విడుదల చేసిన జీ.ఓ.పై అన్ని జర్నలిస్టుల సంఘాల అభిప్రాయాలను, సూచనలను తీసుకొని జీ.ఓ.లో మార్పులు చేర్పులు చేసాము. డెస్క్ జర్నలిస్టులు మరో జర్నలిస్టులనే తేడ మా ప్రభుత్వానికి లేదన్నారు. ఇండ్ల స్థలాల విషయములో కూడా సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఇప్పటికి ఈ విషయములో గౌరవ ముఖ్య మంత్రి గారు స్పష్టత ఇచ్చారని, న్యాయస్థానం పరిధిలో ఇబ్బందులు లేకుండా ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

## బడ్జెట్‌లో విద్యకు 30% కేటాయింపు చేయాలి ఏఐఎస్‌బి డిమాండ్

- ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీం నవీద్ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం



**కరపత్రం ప్రతినిధి వరంగల్ మార్చ్ 18**
రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బి) రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. వరంగల్‌లోని ఏఐఎస్‌బి కార్యాలయంలో సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం విద్యార్థుల ప్రాణ త్యాగాలతో ఏర్పడిన నేపథ్యంలో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం విద్యారంగం అనేక సమస్యలతో సతమత మవుతుండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లోపం, పాఠ్యపుస్తకాల ఆలస్య సరఫరా, హాస్టల్ సదుపాయాల లోపం వంటి సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయిస్తేనే సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని హకీమ్ నవీద్ అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. అలాగే గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. అవసరమైతే విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మిస్బా, అజర్, సుమన్, సాత్విక్, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- పేద ముస్లిం లకు రంజాన్ కానుకల అందజేత....
- నియోజక వర్గానికి ఎక్కువ మొత్తం లో దుస్తుల కిట్ ల కేటాయింపు పట్ల హర్షం....




**కరపత్రం ప్రతినిధి వరంగల్, మార్చి 18**
మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "ఈద్ కా తోఫా" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పేద ముస్లిం లకు దుస్తులను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినం పరస్పర ప్రేమ, దయ, త్యాగానికి ప్రతీక అని సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పండుగల సందర్భంగా అవసరమైన సహాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని,
ముఖ్యమంత్రి మైనారిటీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడిన మంత్రి మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు 3500 "ఈద్ కా తోఫా"లను అందజేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ పర్వదినం అందరికీ శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈద్ కా తోఫా ల అందజేత వల్ల నిరుపేద ముస్లిం లు పండగను సంతోషం గా ఆనందం గా జరుపుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ.. రంజాన్ మనుషుల్లో మనస్ఫూర్తి, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైన పర్వదినమని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే పరస్పర సహకారం అవసరమని, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పండుగలు మనలను ఒకటిగా కలిపే వేదికలని, ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్ఖాన్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, చింతాకుల అనిల్ కుమార్ బస్వరాజు కుమార స్వామి ఆర్ డి వో సుమ, డిఎండబ్ల్యూ ఓ రమేష్, బల్దియా డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు ప్రజలకు "ఉగాది' పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన కేరళ జ్యోతిష్యుడు, బ్రహ్మశ్రీ డా. విష్ణు నంబూద్రి తంత్రి

- ఇ.నెం.2-5-316, కాళోజి కాకతీయ మహిళా కాలేజి దగ్గర, నక్కలగుట్ట-హన్మకొండ



తెలుగు ప్రజల ఆది పండుగైన ఉగాది సందర్భంగా..కేరళ జ్యోతిష్యుడు, బ్రహ్మశ్రీ డా. విష్ణు నంబూద్రి తంత్రి రాష్ట్ర ప్రజలకు, ఓరుగల్లు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కొత్త సంవత్సరానికి శ్రీకారం చుట్టే ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని కోరుకుంటున్నాను.
ఉగాది నాడు పంచాంగ శ్రవణం ఎంతో ముఖ్యమైనది. పంచాంగం ద్వారా రాబోయే సంవత్సర ఫలితాలు, గ్రహగతులు, వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులు, ఆర్థిక మార్పులు వంటి విషయాలను తెలుసుకోవచ్చు. ఇది మన జీవితాన్ని సక్రమంగా ప్రణాళిక చేసుకునేందుకు మార్గదర్శకంగా ఉంటుంది. ఈ కొత్త సంవత్సరంలో ధర్మం, నీతి, సత్యం మార్గంలో నడుచుకుంటూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొని, రైతులు పుష్కలంగా పంటలు పండించాలి, యువతకు మంచి అవకాశాలు లభించాలి.
ప్రజలందరూ ఉగాది పర్వదినాన్ని ఆనందంగా జరుపుకుంటూ, పంచాంగ శ్రవణం ద్వారా సత్ఫలితాలను గ్రహించి, నూతన సంవత్సరాన్ని శుభముగా ప్రారంభించాలని కోరుకుంటున్నానని కేరళ జ్యోతిష్యుడు, బ్రహ్మశ్రీ డా. విష్ణు నంబూద్రి తంత్రి తెలిపారు. పంచాంగం, జ్యోతిష్యంపై మరిన్ని వివరాలకు 7382633461/9676446572 సంప్రదించాలని తెలిపారు.

## ఎంపీ రవిచంద్ర సహాయంతో సొంతగడ్డకు చేరిన ఎన్నారై శ్వేత పార్థివదేహం





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, మార్చి 18**
హన్మకొండ వికాస్ నగర్ నివాసి, ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కే.లక్మారెడ్డి-వెంకటలక్ష్మీ దంపతుల కుమార్తె శ్వేత ఇటీవల అమెరికాలో అకాల మరణం చెందారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆమె ఆ తర్వాత భర్త సురేష్ రెడ్డి, ఇద్దరు పిల్లలతో కలిసి కాలిఫోర్నియాలో నివసిస్తున్నారు. భార్యాభర్త ఇద్దరు కూడా సాఫ్ట్వేర్ ఉద్యోగులు, శ్వేత గుండెపోటుకు గురై ఈనెల 8వ తేదీన అకాల మృత్యువునకు లోనయ్యారు. ఆమె పార్థివదేహాన్ని సొంతగడ్డకు రప్పించేందుకు గాను వారి సమీప బంధువు కృష్ణారెడ్డి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సహాయాన్ని కోరారు. ఆ సమయాన పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి విషయాన్ని హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అమెరికాలోని భారత రాయబారి కార్యాలయ అధికారులను ఆదేశించడంతో శ్వేత మృతదేహం హన్మకొండ ఏన్జీవో కాలనీ రోడ్డులో ఉన్న నివాసానికి చేరింది. ఆమె అంతిమ సంస్కారం పద్మాక్షిగుట్ట సమీపాన ఉన్న శ్మశాన వాటికలో బుధవారం మధ్యాహ్నం జరిగింది.

## లాంగ్ వీకెండ్‌లో ప్రైవేట్ బాదుడు బస్సుల్లో ఇబ్బడిముబ్బడిగా రేట్లు

సామాన్యుడికి సొంతూరి ప్రయాణం భారంగా మారుతోంది. వరుస సెలవులు రావడంతో నగరాల్లో నివసించే ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అదునుగా చేసుకుని ఛార్జీలను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి. మార్చి 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం కావడంతో మధ్యలో ఉన్న శుక్రవారం ఒక్క రోజు సెలవు పెడితే వరుసగా నాలుగు రోజులు పండుగను కుటుంబంతో గడపవచ్చని చాలామంది ప్రణాళికలు వేసుకున్నారు. అయితే.. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రమే ప్రత్యామ్నాయంగా మిగిలాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని సంస్థలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సు ఛార్జీ సుమారు రూ. 1,500 నుంచి రూ. 2,000 మధ్య ఉంటుంది. కానీ ఈ లాంగ్ వీకెండ్ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ ధరలను ఏకంగా 3 నుంచి 4 రెట్లు పెంచేశాయి. నాన్ ఏసీ స్లీపర్ సీట్లకు కొన్ని ప్రముఖ ట్రావెల్స్ సంస్థలు ఒక వ్యక్తికి ఏకంగా రూ. 4,999 నుంచి రూ. 5,700 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సర్వీసుల్లో కూడా టికెట్ ధర రూ. 5,300 దాటిపోయింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే బస్సుల ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగాయి. పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు చేస్తున్నారు. పెంచిన ధరలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'విమాన ప్రయాణం కంటే బస్సు టికెట్ ధరలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాగైతే ఇంటికి వెళ్లడం కంటే నగరంలోనే ఉండిపోవడం మేలు' అని నెటిజన్లు వాపోతున్నారు. సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగల సమయంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, అధిక ధరలు వసూలు చేసే ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుంటారు. కానీ.. ఇలాంటి 'లాంగ్ వీకెండ్స్' సమయంలో ప్రైవేట్ దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

# ఖనిలో నిబంధనలకు తూట్లు.

- ఇష్టారాజ్యంగా షాపింగ్ మాల్స్
- సరైన సౌకర్యాలు లేకున్నా ట్రేడ్ లైసెన్స్ లు
- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- కార్మికులకు లేబర్ చట్టం ప్రకారం కరువైన వేతనాలు
- జీతాలు అడిగితే పనిలో నుండి తొలగింపు
- పండుగ పూట పస్తులుండే పరిస్థితి
- పర్యవేక్షణ అధికారి ఉన్నాడా..?

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 18:** గోదావరిఖనిలో సరైన అనుమతులు లేకున్నా.. రామగుండం కార్పొరేషన్ అధికారులు ట్రేడ్ లైసెన్స్ లు జారీ చేయడం పట్ల అనుమానాలకు తావిస్తుంది. రోడ్డుకు ఐదు ఫీట్ల సెట్ బ్యాక్.. సెల్లార్ పార్కింగ్.. ఫైర్ సేఫ్టీ.. తదితర వాటిని చూసి ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తారు. కానీ గోదావరిఖనిలో మాత్రం అవేమీ అవసరం లేదు. ఎలాంటి నిబంధనలు చూడకుండానే అనుమతులు ఇవ్వడం పట్ల అధికారులు 'మాములు'గా తీసుకుంటున్నట్లు తెలిసింది.

**అసలు కావాల్సిన అనుమతులు...**
షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలంటే దాని విస్తీర్ణం.. ఎంత మంది అందులో పని చేస్తున్నారు.. పార్కింగ్ స్థలం, సెట్ బ్యాక్ ఉందా.. ఫైర్ సేఫ్టీకి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. అనే వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. కానీ ఇక్కడ మాత్రం అవేమీ అవసరం లేదు. వారికి కావాల్సినవి ముట్టజెపితే అన్నీ అనుకున్న విధంగా జరిగిపోతాయి.



**సరైన సౌకర్యాలు లేకున్నా ట్రేడ్ లైసెన్స్ లు..**
ప్రతి రోజూ రద్దీగా ఉండే లక్ష్మీనగర్ ప్రాంతంలో ఇక్కడి అధికారులు షాపింగ్ మాల్ కు అనుమతులు మంజూరు చేశారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసి షాపింగ్ మాల్ కు వెళ్తే.. ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మాల్ ముందే ట్రాఫిక్ నిలిచిపోవడంతో అటు వైపు వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. సరైన సౌకర్యాలు లేకపోయినా ట్రేడ్ లైసెన్స్ లు ఇవ్వడం పట్ల అనుమానాలకు తావిస్తుంది.

**ఫైర్ సేఫ్టీ ఎక్కడ...?**
షాపింగ్ మాల్ లో ఏదైనా ప్రమాదం జరిగితే.. అక్కడకు ఫైరింజన్ చేరుకోవడానికి కూడా వీలు లేకుండా ఉంది. గతంలో హైదారాబాద్ లోని ఓ షాపింగ్ మాల్ లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయి. మాల్ కు ఒక్కటే ముఖ ద్వారం ఉండడంతో అనుకోని సంఘటన జరిగితే ఎవరు భాధ్యత వహిస్తారని పలువురు అంటున్నారు.

**కార్పొరేషన్ ఆదాయానికి గండి..**
ట్రేడ్ లైసెన్స్ జారీలో అవకతవకలు జరుగుతున్నట్లు సమాచారం. విస్తీర్ణాన్ని తక్కువగా చూపి లైసెన్స్ లు జారీ చేస్తున్నట్లు తెలిసింది. షాప్ ల విస్తీర్ణం తక్కువ చేయడంతో ఫీజు తక్కువగా తీసుకోవడంతో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది. దీంతో లక్షల్లో ప్రభుత్వం నష్టపోవాల్సి వస్తుంది.

**పండుగ పూట జీతాలు చెల్లించలేని పరిస్థితి..**
పండుగ పూట కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి రామగుండం కార్పొరేషన్ కనిపిస్తుంది. ఆదాయం లేకపోవడంతో.. కార్మికులు పండుగపుట పస్తులుండే పరిస్థితి ఏర్పడింది.

**కార్మికులకు లేబర్ చట్టం ప్రకారం కరువైన వేతనాలు..**
మాల్స్ సాధారణంగా ఎక్కువ సమయం తెరిచి ఉంటాయి కాబట్టి, షిఫ్ట్ పద్ధతిలో పని గంటల నిబంధనలు చాలా ముఖ్యం. రోజుకు గరిష్టంగా 9 నుండి 10 గంటలు పని చేయవచ్చు (విశ్రాంతితో కలిపి). వారానికి మొత్తం 48 గంటలకు మించకూడదు. ప్రతి 5 నుండి 6 గంటల పని తర్వాత కనీసం 30 నిమిషాల విరామం ఇవ్వాలి. నిర్ణీత పని గంటల కంటే ఎక్కువ పని చేస్తే, గంటకు ఇచ్చే వేతనం కంటే రెట్టింపు చెల్లించాలి. ఒక క్వార్టర్ (3 నెలలు)లో గరిష్టంగా 144 గంటల కంటే ఎక్కువ ఓవర్‌టైమ్ చేయించుకోకూడదు. ప్రతి ఉద్యోగికి వారానికి ఒక రోజు తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. ఏడాదికి 8 నుండి 10 జాతీయ, పండుగ సెలవులు ఇవ్వాలి. ఒకవేళ ఆ రోజున పని చేస్తే, దానికి బదులుగా వేరే రోజు సెలవు లేదా అదనపు వేతనం ఇవ్వాలి.
క్యాజువల్, సిక్ లీవ్స్ సంవత్సరానికి 12 రోజుల సాధారణ సెలవులు, 12 రోజుల అనారోగ్య సెలవులు పొందే హక్కు ఉంటుంది.

**జీతాలు అడిగితే పనిలో నుండి తొలగింపు..**
గోదావరిఖనిలో మాల్స్ లో పనిచేసే కార్మికులు వేతనాలు అడిగితే పనిలో నుండి తొలగింపు చర్యలు చేపడుతున్నారు. గుమస్తాలకు వారు చేసిన సేల్స్ నుండి ఒక శాతం కమీషన్ రూపంలో చెల్లిస్తామని చెప్పి.. నేడు రెండు సంవత్సరాలు గడుస్తున్నా.. వారికి కమీషన్ ఇవ్వడం లేదని గుమస్తాలు వాపోతున్నారు. వారికి ఇచ్చే నెల వారి వేతనం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పండగ పూట పస్తులే..**
పండగ వేళ పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. జీతం అడిగితే పనిచేస్తే చేయి.. లేకుంటే వెళ్ళిపో అంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓ షాపింగ్ మాల్ లో కార్మికుల తొలగింపు..?**
గోదావరిఖని లక్ష్మీనగర్ లోని ఓ షాపింగ్ మాల్ లో వేతనాలు ఇవ్వాలని, మాకు ఇచ్చే కమీషన్ చెల్లించాలని అడిగిన వారిని పనిలో నుండి తొలగించినట్లు తెలిసింది. వీరంతా లేబర్ ఆఫీస్ ముందు నిరసన తెలిపేందుకు సిద్ధమైనట్లు సమాచారం...

**పర్యవేక్షణ అధికారి ఉన్నాడా..?**
ట్రేడ్ లైసెన్స్ విషయంలో ప్రత్యేక అధికారి ఉంటాడు. ఒక షాప్ అనుమతులు తీసుకున్న తర్వాత.. ప్రతి సంవత్సరం వాటిని ప్రత్యేక అధికారి తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ రామగుండంలో ఆ ప్రత్యేక అధికారి జాడ కనబడడం లేదు. షాప్ పై మరొక అంతస్తు నిర్మాణం చేపడితే.. ట్రేడ్ లైసెన్స్ పెంచి ఇవ్వాల్సి ఉంది. పర్యవేక్షణ లేకపోవడంతో కార్పొరేషన్ ఆదాయం తగ్గిపోతోంది. ఇప్పటికైనా లేబర్ ఆఫీసర్ చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

## కోరా, జాన్సన్ ,ఏ ఎన్ సి లలో ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 18**
కోర జాన్సన్ పాటశాలలో బుధవారం తెలుగు నూతన సంవత్సర ఉగాధిని పురస్కరించుకొని పాటశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్,రాంరెడ్డి,సింహాచలం హరికృష్ణ,వంగల సంతోషరెడ్డి అమ్మవారి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి కృష్ణుడి విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థిని విద్యార్థులు ఉగాది పండుగ ప్రాముఖ్యతని తెలియచేసే నృత్యాలతో అలరిశీచారు. డైరెక్టర్లు హరికృష్ణ, సంతోష్ రెడ్డి మాట్లాడుతు విద్యార్తులకీ పరాభవ నామా సంవత్సర శుభకాంక్షలు తెలియచేసి ఉగాది జీవితంలో సుఖసంతోషాలని కలుగచేయాలని, కొత్త కొత్త ఆశలతో, కొత్త పుంతలతో విద్యార్థుల జీవితాలు ఆనందాల హరివిల్లు నింపాలని కోరుకున్నారు. ఉగాది అంటే కొత్తదనానికి ప్రారంభం అని , తెలుగు నూతన సంవత్సరంలో అడుగిడుతున్నందుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండాలని పేర్కొన్నారు. ఉగాది కోర ,జాన్సన్ స్కూల్ ప్రాంగనశీ షద్రుచుల కలయికతో నిండిపొయిందని తెలియజేసారు. విద్యార్థులందరికి ఉపాధ్యాయులు ఉగాది పచ్చడిని ప్రసాదంగ పెట్టారు.పాటశాల ప్రాంగణం మామిడి తోరణాలతో వేప పువ్వుతో ఉగాధి వాతవరణంథో కలకలలాడిందనీ తెలియజేశారు

## విజ్ఞాన్ ఉన్నత పారశాలలో చాంద్రమానేవ శ్రీ పరాభవ నామ సంవత్సరం)




ఉగాది, రంజాన్ పండుగల సంబరాలను పాఠశాల నిర్వాహకులు డి. వీరయ్య ఆధ్వర్వంలో ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం మామిడి తోరణాలతో, విద్యార్థులు హిందూ, ముస్లింల సాంంప్రదాయకరమైన వేషధారణతో ‘ కళకళలాడుతుందనీ ,ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉగాది పండుగ ప్రత్యేకతను, ఉగాది పచ్చడి కేవలం రుచి మాత్రమే కాదు, జీవిత పాఠాల రెసిపీ అని అలాగే ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ గురించి తెలియజేయడం జరిగింది.

## బీరన్న గుడి వద్ద విస్తృత శ్రమదానం కార్యక్రమం... గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 18:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గంగ్రపల్లి గ్రామంలో సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్ ఉప సర్పంచ్ బీరేందర్ ఆధ్వర్యంలో బీరన్న గుడి పరిసరాల్లో విస్తృత శ్రమదానం కార్యక్రమం ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, యువత, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని సేవాభావాన్ని చాటుకున్నారు.
ఈ సందర్భంగా గుడి వద్ద ఉన్న విద్యుత్ సరఫరా లోపాలను గుర్తించిన పంచాయతీ సిబ్బంది తక్షణమే కరెంట్ సప్లై రిపేర్ పనులు చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. దీని ఫలితంగా గుడి పరిసరాల్లో దీపాల వెలుగు మెరుగుపడటమే కాకుండా భక్తులకు మరింత సౌకర్యం కలిగింది.
అలాగే గ్రామ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గడ్డి చెక్కడం, చెత్త తొలగించడం, మురుగు శుభ్రపరచడం వంటి పనులు చేపట్టి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. గుడి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పచ్చదనాన్ని కాపాడే చర్యలు చేపట్టారు.




ఇక గుడి ప్రాంగణంలో కొత్త ఎల్ఈడీ లైట్లు అమర్చడం ద్వారా రాత్రి వేళల్లో కూడా భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించారు. ఆలయాన్ని పూర్తిగా శుభ్రపరచి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చారు. ఈ కార్యక్రమంతో గుడి పరిసరాలు కొత్త అందాన్ని సంతరించుకుని గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి ఇలాంటి శ్రమదానం కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్ బీరేందర్ మ్యాక, పంచాయతీ కార్యదర్శి



రాము కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, పనులు సక్రమంగా జరిగేలా సూచనలు అందించారు.
కార్యక్రమంలో రమేష్ కామండ్ల, అనిల్ గుంటి, రంజిత్ మ్యాక, నిఖిల్ మ్యాక, మల్లయ్య మ్యాక, ఐలయ్య గుంటి తదితర యువకులు చురుకుగా పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారి సమిష్టి కృషితో గుడి పరిసరాలు పరిశుభ్రంగా మారడం గ్రామస్తులందరినీ ఆకట్టుకుంది.
ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు శ్రమదానంలో పాల్గొన్న వారిని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. గ్రామంలో ఐక్యత, సేవాభావం పెంపొందించేందుకు ఈ శ్రమదానం కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

## ఇంటి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానం...
## కమిషనర్ ఆయాజ్‌కు ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 18**
జమ్మికుంట మున్సిపాలిటీ ఇంటి పన్ను వసూళ్లలో 100 శాతం లక్ష్యాన్ని సాధించి తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యండి ఆయాజ్‌కు ఘన సన్మానం నిర్వహించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు పాల్గొని కమిషనర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, జమ్మికుంట పురపాలక సంఘం రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమని అన్నారు. కమిషనర్ ఆయాజ్ సమర్థవంతమైన నాయకత్వం, ప్రణాళికాబద్ధమైన చర్యల వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మీలాంటి అధికారులు తమ పాలకవర్గానికి



తోడుగా ఉండడం సంతోషకరమని, మీ సూచనలు, సలహాలతో జమ్మికుంట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.
వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు మాట్లాడుతూ, ఇంటి పన్ను వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించడం ప్రతి ఒక్కరికీ గౌరవకరమని అన్నారు. ఈ విజయానికి సహకరించిన పట్టణ ప్రజలు, పురప్రముఖులు, వర్తక వ్యాపారవేత్తలు, పత్రిక మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
మున్సిపల్ కమిషనర్ యండి ఆయాజ్ మాట్లాడుతూ, ఈ విజయం తన ఒక్కరికి చెందినది కాదని, మున్సిపల్



సిబ్బంది, ప్రజల సహకారంతో సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పన్ను వసూళ్లలోనే కాకుండా పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో జమ్మికుంటను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన కౌన్సిలర్ స్వర్ణలత నరేష్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 18**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని . హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన నాంపల్లి కనకమ్మ (ఇస్త్రీ షాప్ కిషన్ వారి తల్లి) తెల్లవారుజామున అనారోగ్య కారణాలతో పరమపదించారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే కాలనీలోని ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.
కనకమ్మ సాదాసీదా జీవితం గడుపుతూ అందరితో స్నేహపూర్వకంగా మెలిగిన మంచి వ్యక్తిగా స్థానికులు గుర్తుచేసుకున్నారు.విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక వార్డ్ కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ వారు తక్షణమే అక్కడికి చేరుకుని, కనకమ్మ పార్థివ దేహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి బాధను పంచుకుంటూ మానసికంగా అండగా



నిలిచారు.ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో స్పందించిన కౌన్సిలర్, దహన సంస్కారాల నిర్వహణ కోసం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అవసరమైన మరిన్ని సహాయాలు అందించేందుకు కూడా తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ ఘటనతో హౌసింగ్ బోర్డ్ కాలనీలో విషాద ఛాయలు . కనకమ్మ మృతికి స్థానిక ప్రజలు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని కోరుకున్నారు.